క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూ నగర్: డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు 0863-2224202 నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ముగిసిన శ్రీనారాయణదాస జయంత్యుత్సవాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తున్న శ్రీనారాయణదాస జయంతోత్సవాలు ముగిశాయి. శ్రీఆదిభట్ల నారాయణదాస కథాగాన కళా పరిషత్ ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ కమిటీ, సంస్థ నిర్వాహకులు జ్యోతిప్రజ్వలనతో ఆదివారం ప్రారంభించారు. సప్పా భారతి భాగవతారిని భక్త అంబరీష హరికథాగానం చేయగా, ప్రేక్షకులను అలరించింది. మృదంగంపై జగన్మోహిని, వయోలిన్‌పై చావలి శ్రీనివాస్ వాయిద్యాన్ని అందించారు.

పోలీస్ వాహనంలో క్షతగాత్రులు తరలింపు

నగరంపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను పోలీస్ వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. పాత గుంటూరు పీఎస్ ఎస్ఐ ఎన్.సి.ప్రసాద్ ఆదివారం రాత్రి విధులు నిమిత్తం గుంటూరు తక్కెళ్లపాడు బైపాస్ వైపు పోలీస్ వాహనంలో వెళ్లారు. అదే సమయంలో ద్విచక్ర వాహనాన్ని టాటా మ్యాజిక్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురికి గాయాలై, రోడ్డుపై పడిపోయారు. అప్పటికే స్థానికులు 108 కు ఫోన్ చేయగా స్పందించలేదు. ఎస్ఐ ప్రసాద్ వెంటనే క్షతగాత్రులను వైద్యసేవలు నిమిత్తం పోలీస్ వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. బాధితులు అత్యవసర సేవల చికిత్సా విభాగంలో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలంలో టాటా మ్యాజిక్ వాహనాన్ని వదిలి డ్రైవర్ పరారయ్యాడు.

వ్యక్తి అదృశ్యంపై కేసు



లక్ష్మీపురం: వ్యక్తి అదృశ్యంపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు.. సీతమ్మ కాలనీ ప్రాంతానికి చెందిన వేముల రామాంజనేయులు, శివపార్వతికి ఇద్దరు సంతానం. రామాంజనేయులు ట్రాక్టర్ డ్రైవర్. శనివారం సాయంత్రం 4 గంటలకు ఫోన్ మాట్లాడుకుంటూ హడావుడిగా బయటకు వెళ్ళాడు. తిరిగి భార్య ఫోన్ చేయగా పని మీద బయటకు వచ్చానని తిరిగి వస్తానని చెప్పాడు. మళ్లీ ఒక గంట తరువాత ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో చుట్టు పక్కల, బంధు మిత్రుల ఇళ్ల వద్ద విచారించగా ఎంతకు జాడ తెలియక పోవడంతో భార్య శివపార్వతి అరండల్‌పేట పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు చేసింది. ఆచూకి తెలిస్తే నగరంపాలెం పోలీస్ స్టేషన్ 0863-2234047, సీఐ నజీర్ బేగ్ 8688831336 నంబర్లకు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

సంపూర్ణ చంద్రగ్రహణంతో ఆలయాల మూత

నగరంపాలెం: సంపూర్ణ చంద్రగ్రహణం దృష్ట్యా ఆదివారం తాత్కాలికంగా మూతపడ్డాయి. కొత్తపేటలోని శ్రీఆంజనేయస్వామి దేవస్థానం, పశువుల ఆస్పత్రి ఎదురున్న శ్రీజగన్నాథస్వామి దేవస్థానం, లాలాపేటలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం ఉదయం 11.30 గంటలకు మూసివేశారు. అదే విధంగా బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంతోపాటు పలు ప్రాంతాల్లోని ఆలయాలు మూసివేశారు. ఆలయ శుద్ధి సంప్రోక్షణ కార్యక్రమాల అనంతరం సోమవారం ఉదయం శ్రీస్వామి వార్ల పునఃదర్శనం చేయనున్నట్లు అధికారులు, నిర్వాహకులు తెలిపారు.

సీఎంపై అసభ్యకరమైన పోస్టులపై ఫిర్యాదు

నగరంపాలెం: సీఎం చంద్రబాబుపై అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నారంటూ నగరానికి చెందిన టీడీపీ నేత జి.సతీష్‌కుమార్ ఆదివారం పాతగుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాజీ బాబా దర్గా అభివృద్ధికి కృషి

పెదకాకాని: బాజీబాబా దర్గా అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర వక్ఫ్ బోర్డు ముఖ్య కార్యనిర్వహణ అధికారి మహమ్మద్ అలీ అన్నారు. ఆదివారం పెదకాకాని బాజీబాబా దర్గాను సందర్శించారు. దర్గాకు విచ్చేసిన వక్ఫ్‌బోర్డు సీఈవో మహమ్మద్ అలీకి దర్గా ఈవో షేక్ ఖాజామస్తాన్, సిబ్బంది స్వాగతం పలికారు.

నొప్పులు.. ఫిజియోథెరపితో మాయం

- నేడు ప్రపంచ ఫిజియోథెరపి డే
- పెరుగుతున్న ఆదరణ



జీజీహెచ్‌లో పిల్లలకు ఫిజియోథెరపి చేస్తున్న దృశ్యం

గుంటూరు మెడికల్: శరీరంలో అన్ని రకాల నొప్పులకు ఆపరేషన్‌లతో పనిలేకుండా ఫిజియోథెరపితో ఉపశమనం లభిస్తోంది. వయస్సుతో సంబంధం లేకుండా ఫిజియోథెరపిస్టులు ఆధునిక చికిత్స అందిస్తున్నారు. వైద్య రంగం విస్తరణతో పాత్ర పెరుగుతోంది. సోమవారం ప్రపంచ ఫిజియోథెరపి దినోత్సవం.

అన్ని వైద్య విభాగాల్లో సేవలు...

ఒకప్పుడు ఫిజియోథెరపి వైద్యుల సేవలు కేవలం ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో మాత్రమే వినియోగించేవారు. అనంతరం న్యూరాలజీ వైద్య విభాగంలో ముఖ్యంగా బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు పక్షవాతం నుంచిత్వరితగతిన కోలుకోవడంలో ఫిజియోథెరపిస్టులు కీలకంగా మారారు. నేడు కేవలం ఒకటి రెండు వైద్య విభాగాలకే పరిమితం కాకుండా అన్ని వైద్యవిభాగాల్లో ఫిజియోథెరపిస్టులు తమవంతు పాత్ర పోషిస్తున్నారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, న్యూరోసర్జరీ, న్యూరాలజీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, ఈఎన్‌టీ, కార్డియాలజీ, క్యాన్సర్, ఇలా అన్ని వైద్య విభాగాల్లో చికిత్సలు పొందుతున్న రోగులకు ఫిజియోథెరపి అవసరం ఉంటుంది. ఆపరేషన్లు చేసిన పిదప రోగి సాధారణ స్థితికి చేరుకోవాలంటే తప్పనిసరిగా ఫిజియోథెరపి చేయించాల్సిందే. క్రీడాకారులు చాలా మంది తమ వృత్తి ఎదుగుదలకు ఫిజియోథెరపిస్టల సహాయ సహకారాలు తీసుకుంటున్నారు. పెయిన్‌లెస్ డెలివరీలు చేయటం, కాన్పు తరువాత వచ్చే కాంప్లికేషన్స్ లేకుండా నివారించటంతో ఫిజియోథెరపి కీలకంగా మారింది. చిన్నపిల్లలో వచ్చే శారీరక ఎదుగుదల లోపాలు సరిచేయటంలో పాత్ర ఎంతో కీలకం.

జీజీహెచ్‌లో ఉచిత వైద్యసేవలు



కార్పొరేట్ ఆస్పత్రులకంటే ధీటుగా గుంటూరు జీజీహెచ్‌లో ఫిజియోథెరపి సేవలను ఉచితంగా అందిస్తున్నాం. ముఖ్యంగా గుంటూరు జీజీహెచ్ డైట్ సెంటర్‌లో 19 ఏళ్ల వయస్సు లోపు వారికి వచ్చే పలు రకాల రుగ్మతలను నివారించడంలో ఫిజియోథెరపి చాలా కీలకంగా మారింది. ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి అవసరమైన వారికి ఉచితంగా సేవలు చేస్తున్నాం. పుట్టుకతోనే నడవలేని పిల్లలు, సెరిబ్రల్ పాల్సి, వెన్నెముక సంబంధిత సమస్యలు, పక్షవాతం, ఇతర సమస్యలు ఉన్నవారికి ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డైక్ సెంటర్‌లో ఉచిత సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ కొత్త టీనా, గుంటూరు జీజీహెచ్

అన్ని వైద్య విభాగాలకు కీలకం



జిల్లా వ్యాప్తంగా ఫిజియోథెరపిస్టులు ఐదువేల మంది సేవలందిస్తున్నారు. ఒకప్పుడు నొప్పి నివారణకు మాత్రమే ఫిజియోథెరపి సేవలను వినియోగించేవారు. నేడు ఫిజియోథెరపీ అన్ని వైద్య విభాగాల్లో కీలకంగా మారింది. ఫిజియోథెరపి వైద్య విధానంలో ఎన్నో కొత్త వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. క్యాన్సర్ పేషెంట్‌లకు కిమో సైడ్ ఎఫెక్ట్స్ తెలియకుండా నివారించడంలో కీలకంగా మారింది. గ్యాస్, పొట్ట సంబంధిత సమస్యలు ఫిజియోథెరపి ద్వారా నివారిస్తున్నారు. ఫిజియోథెరపిస్టులకు ప్రత్యేకంగా కౌన్సిల్ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉద్యోగాలు కల్పించాలి.

– డాక్టర్ బాపట్ల వెంకట హరికృష్ణ, ఏపీ ఫిజియోథెరపిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రగతి నగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్ష నిర్వహించిన స్థానికులతో శంకర కంటి ఆసుపత్రి వైద్యులు

లక్ష్మీపురం: సుందరయ్య విజ్ఞాన కేంద్రం(ప్రగతి నగర్) ఆధ్వర్యంలో శంకర కంటి ఆస్పత్రి సహకారంతో మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డులోని కేంద్రంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి 110 మంది హాజరై వైద్య పరీక్షలు పొందారు. అందులో 20 మందికి శస్త్ర చికిత్స అవసరమని డాక్టర్లు నిర్ధారించారు. డాక్టర్ నలిన్, డాక్టర్ అపర్ణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు కే శ్రీనివాసరావు, సీపీఎం నగర కార్యదర్శి కే నళినీ కాంత్ మాట్లాడుతూ శంకర కంటి ఆస్పత్రి వారు పేదలకు ఉచిత కంటి సేవలు గతంలో అనేక ప్రాంతాలలో క్యాంపులు నిర్వహించి పేదలకు శస్త్ర చికిత్స అందించడంలో ముందున్నారన్నారు. శస్త్ర చికిత్స గుర్తించిన వారిని బస్సులోనే శంకర కంటి ఆసుపత్రికి తీసుకుని వెళ్లి శస్త్ర చికిత్స అందించి మరలా తిరిగి పంపించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శిబిరం ఇన్‌చార్జి రవికుమార్, శంకర కంటి ఆస్పత్రి బృందం, సీఐటీయూ నాయకులు బి.ముత్యాలరావు, ఓ పాములు, బి.సుజిత్, గుంజి మౌనిక, ఓ బాజీ ప్రియ, ఎల్.మహాలక్ష్మి, ఎస్.కె. నీలోఫర్, జె.వైష్ణవి, గుంజి నాగవంశీ, సిహెచ్.తేజస్విని పాల్గొన్నారు.

వృద్ధులకు బియ్యం పంపిణీ



వృద్ధునికి బియ్యం సంచి అందిస్తున్న జిల్లా గవర్నర్ శ్రీనివాసరావు

నగరంపాలెం: గత 25 ఏళ్లుగా వాసవి క్లబ్ గుంటూరు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ పులికొండ శ్రీనివాసరావు అన్నారు. వాసవి క్లబ్ గుంటూరు, మహిళా క్లబ్, యువ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్. అగ్రహారం గీతా మందిరంలో 108 మందికి ఉచితంగా బియ్యం, పింఛన్లు, ముగ్గురు విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున ఉపకార వేతనాలు, రహదారిపై వ్యాపారం చేసుకునే ఒకరికి గొడుగు, నంబూరులోని శ్రీకాశీ విశ్వనాథ గోసంరక్షణ గో సేవా సంఘానికి పశుగ్రాసం నిమిత్తం రూ.5 వేలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పులికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడంలో ఎనలేని సంతృప్తి ఉంటుందని అన్నారు. క్లబ్‌ల సభ్యులు అందరూ కలిసికట్టుగా సేవ చేసేందుకు ముందుకు రావడం గొప్ప విషయమని అన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. అధ్యక్షత వహించిన క్లబ్ అధ్యక్షులు రాయవరపు అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి తమ వంతుగా సేవా కార్యక్రమాలను క్లబ్ తరుపున చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి కూనిశెట్టి చంద్రశేఖరరావు, కోశాధికారి వేమూరి ప్రదీప్‌కుమార్, మహిళా క్లబ్ అధ్యక్షురాలు రాయవరపు అనూరాధ, జిల్లా క్యాబినెట్ కార్యదర్శులు బొలిశెట్టి పాపారావు, ఆకుల మురళీకృష్ణ, వైపీఎస్ సత్యనారాయణ, ప్రాంతీయ చైర్‌పర్సన్ మున్నలూరి గౌరీశంకర్, కార్యదర్శి రామారావు, మున్నలూరి లక్ష్మీరాధ, మాజీ అధ్యక్షులు గుడిపాటి భాస్కర్, కోటా శేషగిరి పాల్గొన్నారు.

ఎముకల సాంద్రత నిలుపుకోవడం కీలకం

సీనియర్ ఆర్థోపెడిక్ నిపుణులు కొల్లి జయకిషన్



ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న వైద్యుడు

లక్ష్మీపురం: ఎముకల ఆరోగ్యాన్ని, సాంద్రతను నిలుపుకోవడానికి పౌష్టికాహారం, తేలికపాటి వ్యాయామాలు ఉపయోగపడతాయని సీనియర్ ఆర్థోపెడిక్ నిపుణులు కొల్లి జయ కిషన్ అన్నారు. ఆదివారం గుంటూరు అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఎముకలు, కీలు, కండరాలు వ్యాధులపై ఆరోగ్య సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో చాలా మందిని ఇబ్బందిపెట్టే వ్యాధి ఆస్టియో పోరోసిస్ అని, ఈ వ్యాధిలో బోన్ మినరల్ డెన్సిటీ తగ్గిపోతుందని దీంతో చిన్న దెబ్బలకే ఎముకలు విరిగిపోతాయన్నారు. కొంత మందికి వెన్నెముక, పక్కటిముకలకు ఆస్టియో పోరోసిస్ రావటం వలన సైలెంట్‌గా ఫ్రాక్చర్ అవుతాయన్నారు. నడుం నొప్పి అనిపించడం, నరాలు మొద్దుబారటం, కండరాలు క్షీణించటం లాంటి బాధలు ఆస్టియో పోరోసిస్ వ్యాధిలో ఎక్కువగా వస్తుంటాయని వివరించారు. ఈ వ్యాధి వచ్చిన తరువాత చికిత్స కంటే రాకుండా జాగ్రత్త పడటం ముఖ్యమన్నారు. ఆహారంలో కాల్షియం, విటమిన్-డి ఉండే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ జయ కిషన్‌ను అవగాహన సంస్థ సభ్యులు సత్కరించారు. సభకు ఆరోగ్య సభ కో-ఆర్డినేటర్ టి.వి.సాయిరాం సమన్వయం చేయగా.. సభలో విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ ఆర్.రామ చంద్రరావు, అనమేమా ట్రస్ట్ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి ప్రసంగించారు.

వృద్ధులు, వితంతువులకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీపీఐ నాయకుడు ముప్పాళ్ల లేఖ



లక్ష్మీపురం: అక్టోబర్ ఒకటిన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో వృద్ధుల, వితంతువుల, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆదివారం లేఖ రాశారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో 13 శాతంపైగా 60 సంవత్సరాలు పైబడిన వారు ఉన్నారని చెప్పారు. వీరుగాక తీవ్ర అనారోగ్య సమస్యలతో తమ ప్రభుత్వం అందిస్తున్న రూ.15 వేలు నెలసరి పెన్షన్ పొందుతున్న వారితో పాటు విభిన్న ప్రతిభావంతులు, వితంతువులు సుమారు 80 లక్షలకు పైగా పలు ఇబ్బందులతో తమ జీవితాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. సంక్షేమ పెన్షన్ నిబంధనలు సడలించి అర్హత కలిగిన వయస్సు ఉన్న భార్యాభర్తలు ఇరువురు జీవించి ఉన్న కుటుంబాలలో ఇరువురికి పెన్షన్ మంజూరు చేసి న్యాయం చేకూర్చమని కోరారు. ప్రతి జిల్లాలో ప్రభుత్వపరంగా వృద్ధాశ్రమాలను ఏర్పాటు చేయాలని, ఔత్సాహికులు ఏర్పాటుచేసిన వృద్ధాశ్రమాలకు తగిన గ్రాంట్లు, ప్రోత్సాహాలను అందించాలని తెలిపారు.

విశ్వనాథ సాహిత్యం యువతకు ప్రేరణ కావాలి



విశ్వనాథ పథంలో యువత గ్రంథావిష్కరణ చేస్తున్న వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

నగరంపాలెం: కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ సాహిత్యం యువతకు ప్రేరణ కావాలని వీవీఐటీ విద్యా సంస్థల ఛాన్స్‌లర్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. వివిఐటి విశ్వ విద్యాలయం, విశ్వనాథ సాహిత్య అకాడమీ సంయుక్తంగా ఆదివారం లక్ష్మీపురం శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం సమావేశ మందిరంలో విశ్వనాథ పదంలో యువత దృక్పథం పత్ర సమర్పణ సదస్సు నిర్వహించారు. విశ్వనాథ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ మద్దినేని సింహకౌటిల్యచౌదరి సదస్సుకి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ విశ్వనాథ సత్యనారాయణలో తరచూ సగటు జీవి వేదన కనిపిస్తోందని అన్నారు. అధ్యక్షత వహించిన డాక్టర్ మద్దినేని సింహకౌటిల్యచౌదరి మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యం పునర్జీవానికి కవి సామ్రాట్ సత్యనారాయణ తనదైన శైలిలో బాటలు వేశారని అన్నారు. చారిత్రక నవలల సదస్సుకు డాక్టర్ అబ్బరాజు మైథిలి అధ్యక్షత వహించారు. సాంఘిక నవలల సదస్సుకు వీబీ హేలికళ్యాణ్ అధ్యక్షత వహించారు. ముగింపు సభలో విశ్వనాథ పథంలో యువత గ్రంథావిష్కరణను వాసిరెడ్డి విద్యాసాగర్ చేశారు. యువ రచయితలను ప్రశంస పత్రాలతో సత్కరించారు. సదస్సులో కవి సామ్రాట్ మనవడు విశ్వనాథ సత్యనారాయణ, అకాడమీ సభ్యులు పిన్నమనేని మృత్యుంజయరావు, రావెల సాంబశివరావు, మోదుగుల రవికృష్ణ, కోశాధికారి డాక్టర్ సెట్లం చంద్రమోహన్ పాల్గొన్నారు.

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కుమారి

ప్రత్తిపాడు: సమ్మె కాలపు ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలని.. లేకుంటే ఐక్య పోరాటాలకు సిద్ధమని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏవీఎన్ కుమారి తెలిపారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని అక్షయ విద్యాలయంలో ఆదివారం ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు అంగన్‌వాడీ వర్కర్స్-హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రాజెక్టు మహాసభను నిర్వహించారు. సభకు యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.రమణ, అధ్యక్షురాలు ఏవీఎన్ కుమారిలు హాజరయ్యారు. పి.ప్రేమలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో కుమారి మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు 42 రోజుల పాటు సమస్యల పరిష్కారం కోసం పోరాడారన్నారు. సమ్మె కాలంలో ఇచ్చిన ఒప్పందాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు తల్లికి వందనం, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్, వితంతు పింఛన్ వంటి పథకాల అమలు ఇంకా జరగకపోవడం బాధాకరమన్నారు.


నూతన కమిటీ ఎన్నిక..

మహాసభలో ఆదివారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రాజెక్టు అధ్యక్షురాలిగా కె.పద్మ (చమళ్లమూడి), కార్యదర్శిగా పి.ప్రేమలత (పాండ్రపాడు), కోశాధికారిగా నగరాజకుమారి (ప్రత్తిపాడు), ఉపాధ్యక్షులుగా సుభాషిణి, శివ పార్వతి, ధనలక్ష్మి, శ్రీ వాసవి, నవరత్నమణి, సహాయ కార్యదర్శులుగా విజయ, శశికళ, శ్రీదేవి, నవనీతం, స్వాతిలతో పాటు మరో పదిహేను మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు.

నగరంలో గ్రీనరీ అభివృద్ధికి చర్యలు

నెహ్రూనగర్: కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశాల మేరకు గుంటూరు నగరంలో గ్రీనరీ పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన మొక్కల పేరిట మళ్లీ కక్కుర్తి అనే కథనానికి కమిషనర్ పై విధంగా స్పందించారు. అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ ద్వారా డివైడర్లు, ఇంటింటికి పండ్ల మొక్కలు, ఐలాండ్లు, రోడ్డుకు ఇరువైపులా ప్లాంటేషన్ చేయాలని కేంద్ర మంత్రి ఆదేశాల మేరకు నగరంలో ఐదు లక్షల మొక్కలు పంపిణీ ద్వారా సుందరీకరణ చేపడుతున్నట్లు వివరించారు.

నిత్యావసరాలకు నీళ్లు కరువు!



వాటర్ ట్యాంక్

గుంటూరు రూరల్: వరుస మరణాలతో బెంబేలెత్తిన తురకపాలెం గ్రామ ప్రజలు నీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. ఎవ్వరూ గ్రామంలో నీటిని తాగొద్దని చెప్పిన అధికారులు ఇంటింటికి మినరల్ వాటర్ సరఫరా చేస్తామన్నారు. అదేవిధంగా గ్రామంలో రెండు మూడుచోట్ల నీటి ట్యాంక్‌లను ఏర్పాటు చేసి సరఫరా చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామ ప్రజలు అక్కడికి వెళ్లి నీటిని తెచ్చుకుని తాగుతున్నారు. ఇది ఇలా ఉంటే.. ప్రతి రోజు వాటర్ ట్యాంక్‌ల ద్వారా నీటి కుళాయిలకు నీటిని సరఫరా చేసే పంచాయతీ అధికారులు గడిచిన వారం రోజులుగా నీటిని సరఫరా చేయడం నిలిపివేశారు. నీటిలో బ్యాక్టీరియా ఉందనే అనుమానంతో ప్రజలు ఇళ్లలోని బోరు నీటిని వినియోగించుకునేందుకు భయాందోళన చెందుతున్నారు.

ట్యాంకుల ద్వారా అరకొర సరఫరా..

నీటి ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేయడం నిలిపివేసిన పంచాయతీ అధికారులు ప్రజల నిత్యావసరాలకు ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నీళ్లు అందరికీ అందడంలేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. ప్రజలు ఇళ్లలో ఉండే సమయాల్లో కాకుండా వారికి కుదిరిన సమయంలో నీటిని సరఫరా చేస్తుండటంతో పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారికి నిత్యావసరాల నీరు కరువవుతోంది. ప్రజలకు ప్రతి ఇంటికి నీటిని సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. అలానే గ్రామంలోని తూర్పు బజారుకు భోజనాల వసతి ఏర్పాటు చేయలేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు.

బాబు ఏడాది పాలన మోసాలమయం

- ఎన్నికల ముందు మోసపు హామీలు
- గెలిచాక మోసగించడం చంద్రబాబు నైజం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, పశ్చిమ సమన్వయకర్త అంబటి రాంబాబు



క్యూ ఆర్ కోడ్‌ను చూపుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు, పార్టీ నాయకులు

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్రంలో పరిపాలన స్తంభించిపోయిందని, ఎక్కడ చూసిన మోసాలమయమైందని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని 24వ డివిజన్ ఏటీ అగ్రహారంలో పార్టీ నాయకులు బాజీ, యూనస్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు మొసలి కన్నీరు కార్చి అధికారంలోకి వచ్చిన తరువాత వెన్నుపోటు పొడవటం చంద్రబాబుకు అలవాటే అన్నారు. ఎప్పుడు ఎన్నికల్లో పోటీ చేసినా ఏదో ఒక పార్టీ మద్దతులో కల్లబొల్లి మాటలు చెప్పడం.. గెలిచిన తరువాత ప్రజల్ని మర్చిపోవడం ఆయన నైజమని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ఇంటింటికీ తిరిగి కూటమి నాయకుల ఫొటోలు వేసుకుని బాండ్లు పంపిణీ చేశారని, ఆ బాండ్లలో ఉన్న అంశాలను ఎవరైనా ప్రశ్నించిన వారిపై అరెస్టులు, కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయడం సర్వసాధారణమైందని విమర్శించారు. అన్నదాతకు ఎరువులు కొరత, పండించిన పంటకు మద్దతు ధర లేదన్నారు. ప్రతి పనికి దోచుకోవడం, దాచుకోవడం అన్నట్లు పనులు చేస్తున్న టీడీపీ నాయకులు అవినీతి కూపంలో కూరుకుపోయారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ దౌర్జన్య పాలనకు చరమగీతం పాడాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అచ్చాల వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, కాంట్రకుంట గురవయ్య, పార్టీ నాయకులు శారదలక్ష్మీ, చదలవాడ రవీంద్రనాథ్, సురసాని వెంకటరెడ్డి, ఖాజా మొయిద్దీన్, కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, సింగు నరసింహ, ఆనంద్, షేక్ నాగూర్, మామిడి కిషోర్, సుభాని, సునీల్ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను విరమించుకోవాలి



కుమ్మర క్రాంతి కుమార్

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను విరమించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మెడికల్ కాలేజీలను తీసుకొచ్చారని.. వాటిని కూటమి ప్రభుత్వం యథావిధిగా పనులు చేపట్టి ముందుకు తీసుకుపోవాలని కోరారు. కరోనా కాలంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం కొరతగా ఉండడం వలన చాలా మంది మరణించడం జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం గుంటూరు తురకపాలెంలో మెడికల్ అవగాహన లేక 40 మంది చనిపోవడం జరిగిందన్నారు. ఇలాంటి ఇబ్బందులను అధిగమించేందుకు మెడికల్ వ్యవస్థను ప్రభుత్వం నిర్వహించాల్సి ఉండగా సదరు పెండింగ్ పనులన్నీ పీపీపీ మోడల్‌లో ప్రైవేటీకరణ చేస్తే నిరుపేదలకు వైద్యం అందకుండా పోతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నీటి కాలుష్యాన్ని నివారించకనే మరణాలు

గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామంలో వరుస మరణాలకు ప్రధాన కారణం నీటి కాలుష్యమేనని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం నాయకులు ఆరోపించారు. ఆదివారం సంఘం నేతలు గ్రామంలో పర్యటించారు. మృతుల కుటుంబాలను పరామర్శించి జరిగిన సంఘటన వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తురకపాలెంలో వరుస మరణాలకు కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కేవలం ప్రభుత్వ వైఫల్యం కారణంగానే మరణాలు సంభవించాయని వాపోయారు. ఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే పెద్ద సంఖ్యలో మరణాలు సంభవించాయన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

హోమ్‌లోన్ సెంటర్ (ఆర్ఏసీసీసీ), డోర్ నెం.26-1-52, కన్నావారితోట, గుంటూరు-522004

సంక్షిప్త డిమాండ్ నోటీసు

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద - జారీ చేయబడిన నోటీసు)

I) ఋణగ్రహీత పేరు మరియు చిరునామా : శ్రీ కమతం నరసింహారావు, తండ్రి : ఆనందరావు, డోర్ నెం.27-202, 8వ లేన్, కోబాల్ట్ పేట, గుంటూరు - 522002.

II) లోన్ ఖాతా మరియు అకౌంట్ నెం : NPA Account No. P-LAP : 43468659712

III) చెల్లించవలసిన బాకీ మొత్తము: తేది.25-08-2025 నాటికి రూ.41,12,436/- (అక్షరాల నలభై ఒక్క లక్షల పన్నెండు వేల నాలుగు వందల ముప్పై ఆరు రూపాయలు మాత్రమే) + కాంట్రాక్చువల్ రేటు ప్రకారం భవిష్య వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు, ఇతర ఖర్చులు మొదలైనవి.

IV) డిమాండ్ నోటీసు తేది : 25-08-2025 ఎన్‌పిఏ తేది: 22-08-2025

V) ఆస్తి వివరములు: శ్రీ కమతం నరసింహారావు, తండ్రి : ఆనందరావు గారికి చెందిన ఆస్తి: గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరు సిటీ, బ్రాడీపేట ఎక్స్‌టెన్షన్ ఏరియా, టౌన్ సర్వే కాని గుంటూరు గ్రామ డి.నెం. 14, రీ-సర్వే నెం.14/2 లోని ఎ.3.42 సెంట్లు, దానిలో ప్లాట్ నెం.23 పార్ట్‌లోని 346.1/3 చ॥గ॥లు లేదా 289.59 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలం మరియు అందు నిర్మించిన అసెస్మెంట్ నెం.2754, కొత్త అసెస్మెంట్ నెం.5286-ఎ, పాత డోర్ నెం.5-66-170, కొత్త డోర్ నెం.5-60-317తో గల ఆర్‌సిసి భవనం & ఎసి షీట్ రూఫ్ షెడ్. హద్దులు: తూర్పు: 6 అ॥ల వెడల్పు దారి - 43'.0", దక్షిణం : ఇరుగులపాటి గోవిందరావు మరియు ఇతరుల ఆస్తి - 72'.0", పడమర : ఇరుగులపాటి గోవిందరావు మరియు ఇతరుల ఆస్తి - 43'.0", ఉత్తరం : మెయిన్ రోడ్డుకు కనెక్షన్ ఉన్న మున్సిపల్ రోడ్డు - 73'.0".

(రిజిష్టర్డు విల్ డాక్యుమెంట్ నెం.141/1992, తేది.20-03-1992 ప్రకారం)

పైన చెప్పబడిన ఋణగ్రహీతలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్రాడీపేట బ్రాంచ్ (06307), గుంటూరు వారి నుండి ఋణం పొంది ఉన్నారు. సదరు ఋణమునకు పైన పేర్కొన్న ఆస్తిని హామీగా ఇచ్చియున్నారు. ఋణము యొక్క నియమ నిబంధనల ననుసరించి సకాలంలో చెల్లించకపోవుటచే సదరు ఖాతాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నియమనిబంధనల ప్రకారము నిరర్థక ఖాతాగా పరిగణింపబడినది. బ్యాంకు వారు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించిన డిమాండు నోటీసు తిరిగి వచ్చినందున/ ఋణగ్రహీతల సంతకములు సరిగా లేనందున పత్రికా మూలకముగా మీకు మరల నోటీసు జారీ చేయుచున్నది. కావున సదరు ఋణగ్రహీతలు పైన పేర్కొన్న మొత్తములను ఈ ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా, వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా చెల్లించవలసినదిగా కోరడమైనది. లేని పక్షంలో పైన పేర్కొన్న చట్టము ప్రకారము బ్యాంకు బకాయిని రాబట్టుకొను నిమిత్తం తదుపరి చర్యలు గైకొనుట దిగువ సంతకందారునికి అనివార్యమవుతుంది.

తేది : 25-08-2025 అధీకృత అధికారి

ప్రదేశం : గుంటూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

(గుంటూరు వెస్ట్)

9912220356

Office mail : sakshigntadvt@gmail.com